**అమ్మమ్మ వెనకాల చెప్పులు లేని కాళ్లతో చుర్రున మండే ఎండలో నడుస్తూ ఉంటే, "నా తల్లే! వచ్చేసింది ... అదిగో, ఆ కనబడే మలుపు తిరగగానే వచ్చేస్తుంది!" అంటూ నా నెత్తిన తన కొంగు కప్పడానికి ప్రయత్నించేది.**

బలభద్రపాత్రుని రమణి

# ఇల్లు

ఆ కొంగుచివర ముడి విప్పితే పటికబెల్లం ముక్కలుండేవి. ఆవిడ చేతిలో మట్టుమరచెంబులో నీళ్లుండేవి. ఆవిడ కడుపులో కడివెడు బెంగ ఉండేది కాబోలు ఊరికే కొంగుతో కళ్లు అద్దుకునేది. ప్రతి నెలా మొదటివారంలో నాకు ఇది అలవాటే! ఉన్నంతలో శుభ్రమైన గౌను తొడిగి, కాళ్లకి కొబ్బరినూనె రాసి, గట్టిగా జడ బిగించి, "నాతో వస్తావా, జీళ్లు కొనిపెడతానూ!" అనేది అమ్మ వినకుండా.

నాకు అర్థమైపోయేది. తల ఊపి, ఆవిడ వెంట బయల్దేరేదాన్ని.

ఇద్దరం నడిచి నడిచి, ఇక నడవలేనిచోట ఆవిడ కొంగు విప్పి రూపాయి బిళ్లతీసి బస్సుకోసం నిలబెట్టేది. నాకూ బస్సు ఎక్కాలని సరదాగానే ఉండేది. కానీ ఎంతోసేపు కాదు. బస్సు దిగగానే మళ్లీ నడక. అలా నడిచి నడిచీ చివరికి ఆ ఇంటికి చేరేవాళ్లం.

ఆ ఇల్లు చూడగానే ఆవిడ నా చెయ్యి వదిలిపెట్టేసేది. ఆత్రంగా ముందుకెళ్లి ఆ గోడల్ని తడిమేది. నేను ఇంటిముందున్న బాదంచెట్టుకింద హుషారుగా కాయలేరుకుంటూ ఉండేదాన్ని.

ఆవిడ అలా ఉద్వేగంగా కొన్ని క్షణాలు అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందాక, బెరుకుగా కటకటాల తలుపు తట్టేది.

"ఎవరూ?" అన్న కర్కశమైన గొంతు ఖంగున మోగి, ఆ వెనుకే ఆ లావుపాటి ఆవిడ నోటినిండా తాంబూలం వేసుకుని నములుతూ బయటకొచ్చేది.

అమ్మమ్మ ఓ వెర్రి నవ్వు నవ్వి, "జనాబాయ్! అబ్బాయి ఉన్నాడా?" అని అడిగేది.

జనాబాయ్ మొహం చిరుబుర్లాడించుకుంటూ, "లేడు! పనిమీద బొయ్యిండు!" అనేది.

అమ్మమ్మ ఉస్సూరుమంటూ ఆ అరుగుమీదే నిలబడి, "ఎప్పుడొస్తాడు?" అనేది.

ఆమె కసురుతున్నట్లు "మొగోళ్ల ... ఎన్నడొస్తారో చెప్పనీకి అవుతదా? నీ పైసలు తీస్కపో!" అని విసురుగా లోపలికెళ్లేది.

అమ్మమ్మ నన్ను దగ్గరికి పిలిచి మరచెంబులో నీళ్లుపోసి తాగించేది.

ఈలోగా ఆ ఇంట్లోంచి ఇద్దరు ముగ్గురు పిల్లలు బయటికొచ్చి బాదంకాయలు లాగేసుకుంటూ, "అమ్మా! ఈ పోరి బాదంకాయలు దొబ్బుకుపోతోందే!" అని అరిచేవారు.

నాకు కోపం వచ్చి, "అమ్మమ్మా! ఈ ఇల్లూ, చెట్టూ అన్నీ మనవే కదా! వీళ్లు ఇట్లా చేస్తారేం?" అనేదాన్ని.

అమ్మమ్మ కన్నీళ్లు పెట్టుకోవడం మినహా ఏమీ చెప్పలేకపోయేది.

"ఇగో, అరవై రూపాయలు. అద్దె తీస్కపో!" అని జనాబాయ్ గిరాటేస్తున్నట్లుగా అమ్మమ్మకిచ్చేది. అమ్మమ్మ వాటివంక విరక్తిగా చూసి, "అబ్బాయి ఇల్లు ఖాళీ చేసే విషయం ఏమైనా చెప్పాడా?" అనేది.

అప్పటిదాకా కాస్త శాంతంగా ఉన్న ఆ స్త్రీమూర్తి ఈ మాటతో విజృంభించి అనర్గళంగా అమ్మమ్మని తిట్టేది. "ఏందీ? మాటకి ఇల్లు ఖాళీ చెయ్యి, ఖాళీచెయ్యి అంటవ్! ఈసారి అంటే మంచిగుండదు మల్ల! ఇరవై సంవత్సరాలసంది ఈ ఇంటికి ఎంత సొమ్ము పెట్టినమో ఎరికుందా? ఇక నువ్వు రానేవొద్దు! టపాల నీ అద్దె నీకు పంపిస్త! పో! పో!" అని కటకటాలు భళ్లున మూసేసేది.

మాకేసి ముష్టివాళ్లని చూసినట్లుగా వెలపరంగా చూసేవాళ్లు ఆవిడ పిల్లలు.

అమ్మమ్మ బతిమాలుతూ "కొడుకులు లేనిదాన్ని. నీ మొగుణ్నే కొడుకులా అభిమానించి ఇల్లు అద్దెకిచ్చాను. ఇరవై ఏళ్లుగా ఖాళీ చెయ్యమన్నప్పుడల్లా ఏవో వంకలు చెప్తుంటే ఓపిగ్గా భరించాను. ఇంక నా పిల్లలకి నా అవసరం తీరింది. ఆడపిల్లల దగ్గర ఎంతకాలముంటాను? నా గూడు నాకు ఇచ్చేయండి తల్లీ!" అని దండం పెట్టేది.


ఆమె ఎకసక్కెంగా, "కొడుకు అనుకుంటివిగా, అట్లే అనుకో! కొడుకుకే అయితది ఇల్లు. ఇంక ఏడిసేది ఏమిటికి? డ్రామా చెయ్యకు ముసల్దానా! గమ్మున వచ్చిన తట్టే ఎనక్కి మర్లిపో!" అని బెదిరించి లోపలకి చక్కా పోయేది.

అమ్మమ్మ ఆ ఇంటిని ఎంత కష్టపడి కట్టిందో తనకి తనే చెప్పుకుంటూ కాసేపు ఏడ్చేది. పక్కింటివాళ్లు సానుభూతిగా గోడమీంచి తొంగిచూసేవాళ్లే కానీ పలకరించే సాహసం చెయ్యలేకపోయేవారు. ఆ పేటలో ఆ ఇంట్లో వాళ్లకున్న పేరు అలాంటిది.

అ అరుగుమీదే కాసేపు కూర్చుని తృప్తిపడి, ఎండ తగ్గాక మళ్లీ నా చేతిని పుచ్చుకుని అమ్మమ్మ నడక మొదలెట్టేది.

అటూ ఇటూ రెండు వసారాలూ, రెండు గదులూ ఉన్న ఆ ఇల్లు పాతగిల్లిపోయి, చెమ్మగిల్లిన కళ్లతో అమ్మమ్మకి దీనంగా వీడ్కోలు ఇస్తున్నట్లు కనిపించేది.

అమ్మమ్మ సందు మలుపు తిరిగేదాకా వెనక్కి



అమ్మమ్మ సందు మలుపు తిరిగేదాకా వెనక్కి వెనక్కి తిరిగి ఆ ఇంటిని చూస్తూనే సాగేది.

అమ్మ ఆఫీసునుండి వచ్చాక అమ్మమ్మతో - "అద్దె వసూలుకి వెళ్లొచ్చావా? ఏం అన్నారూ? హుఁ, నాకు తెలుసు, నాన్నగారు బతికి ఉన్నంతకాలం స్వాతంత్ర్యంకోసం పోరాడుతూ ఉన్నదంతా దేశానికి పెట్టారు. పోయాకమాత్రం అయాచితంగా ఆ గవర్నమెంటు వాళ్లిచ్చిన్న డబ్బు నీకు దక్కనిస్తారా? ఆ డబ్బుతో కట్టిన ఆ ఇల్లు నీకు దక్కకుండా ఆయన ఆత్మ అడ్డుపడుతోంది!" అనేది.



### వాంఛారాహిత్యం

ఎప్పుడూ మరింతకావాలి అని కోరుకుంటూ ఉంటావుకాబట్టే, నీ జీవితంలో ఇంత వెలితి. ఇంకా ఇంకా కావాలనే ఈ కోరిక వదిలెయ్... నీలోని వెలితి, ఖాళీ మాయమవుతాయి. కోరికే నీలోని ఈ ఖాళీకి మూలం. కోరికను వదిలేసి చూడు... లోన విస్తరించేదానితో ఎలా పొంగి ప్రవహిస్తావో నీకే తెలుస్తుంది. మరొకరితో పంచుకోవాలని ఎదురుచూస్తుంటావు. కోరిక ఒక గోడలాంటిది; వాంఛారాహిత్యం గొప్పవంతెన లాంటిది.

-రజనీష్

తాతయ్య స్వాతంత్ర్యం వచ్చాక ఏ పదవి ఇస్తానన్నా వద్దన్నారనీ, తనకంటూ ఏమీ మిగల్చలేదనీ అమ్మమ్మ అప్పుడప్పుడూ బాధపడినా అంతలోనే, "మీ తాత సింహమే! సింహం! ఆకలేసినా గడ్డి కరవదు!" అనేది గర్వంగా.

ఆ రాత్రి వాకిట్లో చాపమీద అమ్మమ్మ పక్కన పడుకుని ఆవిడ చెప్పే కథ వింటున్నాను.

"చేపా, చేపా ఎందుకు ఎండలేదూ అంటే గడ్డమేటు అడ్డొచ్చిందీ అంది. గడ్డిమేటూ గడ్డిమేటూ ఎందుకు అడ్డొచ్చావూ అంటే దూడ మెయ్యలేదూ ... అంది! దూడా దూడా ..."

ఆవిడ చెప్తూనే ఉంది. ప్రాణం లేకపోయినా అవి మాట్లాడినట్లే మా ఇల్లు కూడా మాట్లాడి, "నేను ఆ ముసలమ్మ ఆస్తిని. మీరెవరు నన్ను అనుభవించడానికి?" అని వాళ్లని తన్ని తగలేస్తే ఎంత బాగుండునూ అనిపించింది. ఆ ఊహల్లో మా ఇంటితో కాసేపు కబుర్లాడాను. ఎప్పుడు నిద్రొచ్చిందో తెలీదు, తెల్లవారుజామున నాకో కలొచ్చింది.

మా ఇల్లు నడుచుకుంటూ మా దగ్గరకి వచ్చేస్తోందట! ఇంట్లో ఉన్న ఆ మూక భయంతో పెడబొబ్బలు పెడుతున్నారట! వీధిన పోయే జనం వింతగా చూస్తుండగానే అది బిరబిరా నీళ్ల దగ్గరకెళ్లి ఆ ఇంట్లో సంతని బుడుంగున ముంచేసి, మా దగ్గరకు పరుగెత్తుకుని వచ్చేసి, "నే వచ్చేశా!" అందిట.

నేను "భలే...! భలే!" అని చప్పట్లు కొట్టి నవ్వుతుంటే, అమ్మమ్మ కుదిపి నిద్ర లేపి "అమ్మడూ! కలొచ్చిందా?" అంది.

"ఊఁ." అని ముసుగుపెట్టేసి ఆ కల నిజం అవ్వాలనీ, అమ్మమ్మ ఇంక ఏడవకూడదనీ దేవుడుని ప్రార్థిస్తూ పడుకున్నాను.

❀ ❀ ❀

వాళ్లమాటా, వీళ్లమాటా విని, అమ్మా, అమ్మమ్మా ఇల్లు ఖాళీ చెయ్యమంటూ అద్దెకున్నవాడిమీద దావా వేశారు. దాంతో వాడు అద్దె డబ్బులు కూడా ఇవ్వడం మానేశాడు.

అమ్మమ్మతో కోర్టు గుమ్మాలకి తిరగడం మళ్లీ మొదలైంది.

"ఇంటిని కళ్లారా నెలకొసారి చూసుకోనన్నా చూసుకునేదాన్ని! ఈ చేతుల్తో దిమ్మిస కొట్టాను, మట్టి తట్టలు మోశాను ..." అని అమ్మమ్మ తలుచుకుని తలుచుకుని కుమిలిపోయేది.

కోర్టులో క్రమం తప్పకుండా వాయిదాలు అవుతూనే ఉన్నాయి. మధ్యమధ్యలో సెలవులు కూడానూ.

"ముసలమ్మా! ఎంతకాలం ఇట్లా కోర్టులకి డబ్బు పెడతావూ? అసలే ఆడపిల్లల సొమ్ము? ఆ అద్దెకున్నవాడే ఇల్లు కొంటాడట, ఓ పాతికవేలకి అమ్మిపారేద్దూ!" అంటూ రాయబారాలు వచ్చాయి.

"నా ఇల్లు ... నా రక్తం, చెమటా కలిపి కట్టాను. ఈ కట్టె అక్కడే కాలిపోవాలి. వాడికి చచ్చినా అమ్మను!" అని అమ్మమ్మ తెగేసి చెప్పింది.

నేను పట్టిగౌన్లలోంచి లంగా ఓణీల్లోకి వచ్చాను.

అమ్మమ్మ అడుగుతీసి అడుగు వెయ్యలేని స్థితిలో మంచంలో పడింది.

అమ్మా, పెద్దమ్మలూ కలిసి ఇల్లు వాడికే బేరం పెడ్తేనో అని ఆలోచించారు. కానీ అమ్మమ్మ అందుకు ఒప్పుకోక శోకాలు పెట్టింది.

ఇంట్లో వెండి సామానూ, ఇత్తడి బిందెలూ అన్నీ షావుకారింటికి కాపురమెళ్లి లాయర్‌గారికి ముడుపులు చెల్లించాయి!

అమ్మమ్మ ఏడిస్తే, లాయర్ ధైర్యం చెప్తూ "ఇంకాస్త ఓర్చుకోండి, మూడు లక్షలు ఖరీదు చేసే ఇల్లు ... మనకే దక్కుతుంది!"

ఓ అనాథ ముసలావిడకి, తన భర్త స్వాతంత్ర్యపోరాటంలో పోయినందుకు భృతిగా ఇచ్చిన డబ్బుతో కట్టిన ఇల్లు అది. ఆవిడ సొమ్ము ఆవిడకి ఇప్పించడానికి పనికివచ్చే పాయింట్ ఒక్కటీ లేదా ఈ లావుపాటి లా బుక్స్‌లో ... అని ఆయన అలమారాలను అయోమయంగా చూసేదాన్ని.

కోర్టుకి మళ్లీ వానాకాలం సెలవులొచ్చాయి.

అమ్మమ్మకి రక్తపోటు అధికమై మంచంలోంచి కదలడంలేదు. ఆసుపత్రికి తీసుకెళ్తూనే ఉన్నారు. అయినా గుణం కనిపించడంలేదు. ఆవిడ మనోవ్యాధికి మందులేదని అందరికీ తెలుసు.

ఓ రోజున నన్ను దగ్గరకి పిలిచి, "అమ్మడూ! ఓసారి ఇల్లు చూసొస్తావా? నీకు జీళ్లు కొనిపెడతాను!" అంది.

నాకు కన్నీళ్లొచ్చాయి. అప్పటికి నాకు జీళ్లకి ఆశపడే వయసు దాటిపోయింది. "అలాగే, అమ్మమ్మా!" అని ఆ రోజు కాలేజీ నుండి వస్తూ వస్తూ ఆ ఇంటికి వెళ్లాను.

జబ్బులో ఉన్న మనిషికి అలంకరణలు చేసినట్లు ఇంటికి సున్నాలు వేయించారు. మేడమెట్లు విరక్కొట్టేస్తూ మనుషులు కనిపించారు. నేను ధైర్యంచేసి ఆ పక్కింట్లోకి వెళ్లాను. నేను ఫలానా అని చెప్పుకుని, "వాళ్లింట్లో ఏమిటి హడావుడీ?" అని అడిగాను.

"వాళ్ల అమ్మాయి పెళ్లి. మేడమెట్లు ముందుకు ఉంటే అచ్చిరాదని ఎవరో వాస్తు చెప్పారట. అందుకే వెనకాలకి మారుస్తున్నారు. ముసలమ్మకి ఎలా ఉందీ? పాపం కష్టపడి కూలివాళ్లతో సమానంగా పనిచేసి ఆ ఇల్లు కట్టింది. దుర్మార్గుడికి అద్దెకిచ్చింది!" అని జాలిపడ్డారు.

నేను ఇంటివైపు చూస్తూ కూర్చున్నాను. సీమబాదంచెట్టు కొట్టేశారు. కాళ్లూ, చేతులూ విరిచి క్రూరంగా హింసిస్తున్న ముష్కరుల చేతిలో పడి విలవిలా తన్నుకుంటున్నట్లుగా అసహాయంగా చూస్తోంది ఇల్లు!

నేను వస్తూ వస్తూ ఇంటిని ఓసారి తడిమి చూడాలన్న కోరికని బలంగా నిగ్రహించుకుని, 'పరాయివాళ్ల చేతికి చిక్కిన భరతమాతలా అలా కన్నీరు కారుస్తున్నావా? ఆ కన్నీటిలో వాళ్లని ముంచెయ్యకూడదూ?' అనుకున్నాను. అడుగులు ముందుకి వేస్తుంటే వెనకునుండి ఇల్లు 'ఆగమంటూ' పిలుస్తూనే ఉంది.

ఆరోజు అమ్మమ్మ పరిస్థితి ఏం బాగుండలేదు. అమ్మ మంచందగ్గరే కూర్చుని ఆవిడ కాళ్లు రాస్తోంది. శుష్కించిన దేహంలోని ఆవిడ గాజుకళ్లు నన్ను చూడగానే ఆశగా మెరిశాయి.

నేను ఆవిడ మంచం మీద కూర్చుని, "ఇల్లు బాగుచేయిస్తున్నారు ... వాళ్ల పిల్ల పెళ్లట!" అన్నాను.

ఆవిడ తెచ్చిపెట్టుకున్న ఓపికతో, "పక్కగోడలకి గిలాబాలు వేయించారా? వర్షానికి చెమ్మగిల్లిపోతున్నాయా?" అని అడిగింది.

వదిలెయ్యకూడదూ? ఏ ఘడియన కట్టావోగానీ జీవితం అంతా దానికే ధారపోస్తున్నావు!" అంది.

అమ్మమ్మ అదోరకంగా నవ్వి, "బిడ్డని కని మరిచిపోగలమా? ఇదీ అంతే ... దానితో నా రుణం చాలా స్వల్పం అన్నమాట!" అంది.

ఆవిడ కన్నీళ్లు ఆగని ముసురుని తలపించాయి. వానలు జోరు అందుకున్నాయి. ముసురు మూడురోజులు లోకాన్ని కప్పేసిందా అన్నట్లుగా ఎడతెరిపి లేకుండా కురిసింది! ఆ రోజు కాస్త తగ్గుముఖం పట్టింది.

అమ్మమ్మకి బాలేదన్న కబురు తెలిసి పెద్దమ్మా, పిల్లలూ వచ్చారు.

అమ్మమ్మకి ఆ రోజు ముమ్మరంగా జ్వరం కాస్తోంది. ఏదో లోకంలో ఉన్నట్లు మాట్లాడుతూ, "ఆ గోడలకి సున్నం వేయించాక అందం వచ్చిందే ... పై కప్పు చెమరిస్తున్నట్లుంది చూడూ!" అంటోంది.

"సంధి ప్రేలాపనలా ఉంది!" అంది పక్కింటావిడ.

ఇంతలో లాయర్‌గారొచ్చారు - "ఆవిడకెలా ఉందీ?" అని అడిగారు.

నల్లబట్టల్లో ఆ రోజు కాలుడిలా లేరు. తెల్లని ధోవతీ లాల్చీలో శాంతికపోతంలా ఉన్నారు.

"అదే బాగు ..." అని నిట్టూర్చింది అమ్మ.

"ఈ వార్త ఆవిడకి చెప్పవచ్చో లేదో గానీ మీ ఇల్లు దక్షిణంవైపు గోడ కూలి ఆ ఇంట్లో ఉన్నవాడిమీద పడిందట. తల పగిలి అక్కడికి అక్కడే పోయాడట!" అన్నారు.

ఆ మాటలు వింటున్న నాకు ఆశ్చర్యం వేసింది.

"అయ్యో పాపం!" అంది అమ్మ.

"తెల్లారితే పిల్ల పెళ్లి తలపెట్టుకున్నారు కూడానూ ... దైవలిఖితం ఎవరు తప్పించగలరు?" అన్నారాయన.

అమ్మమ్మకి కూడా ఈ సంగతి చెప్పారు.

"మేడమెట్లు మార్చకుండా ఉండాల్సింది. ఎంత ఆపద తెచ్చుకున్నాడూ ... ఇంత అశుభం జరిగిందా?" అని బాధపడింది.

నాకుమాత్రం మా ఇల్లు వాళ్లమీద కసి తీర్చుకుంది అనిపించింది.

ఆ తర్వాత ఆ ఇంట్లో అద్దెకున్నవాడి భార్యా పిల్లలు కోర్టు గురించి పట్టించుకోలేదు. ఇల్లు ఖాళీ చేయమని ఆర్డరు వచ్చింది. సామాన్లు బయటపారేసి వాళ్లని ఖాళీ చేయించారు.

అమ్మమ్మని ఆటోలో కూర్చోబెట్టి ఆవిడ ఇంటికి తీసుకెళ్లాం. ఇల్లు మామిడాకుల తోరణాలతో అలంకరించుకుని కొత్తగా కనిపించింది. కూలిన గోడకి మళ్లీ మరమ్మతులు చేశారు. అమ్మమ్మ కాలు పెట్టగానే ఇల్లు ఆనంద తరంగిణి అయి, జలజలా ఆత్మీయత జాల్వార్చినట్లు నాకు అనిపించింది.

ఇంటిముందు అప్పుడే మొలకెత్తుతున్న చిన్న బాదం చెట్టుకు నేను కంచె కడుతుంటే, 'చూశావా! ఎవరూ చెయ్యలేని న్యాయం నేను చేశాను!' అని ఇల్లు నాతో కబుర్లు చెప్పింది. ■


రాయలసీమ చెవి, ముక్కు, గొంతు వ్యాధుల క్లినిక్

7 రోడ్లు, కడప.

ఫోన్ : 08562 - 25310



డా॥ బి. శ్రీరామమూర్తి

M.B.B.S; M.S; (ENT) DLO.FCCP

* మైక్రో ఇయర్ సర్జరీ (జర్మనీ)
* స్కల్ బేస్ సర్జరీ (స్విట్జర్లాండ్)
* చెవి, ముక్కు, గొంతు మరియు హెడ్ అండ్ నెక్ సర్జన్